క్లుప్తంగా

జూట్‌మిల్లుల్లో భద్రతా వారోత్సవాలు



పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందచేస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): జాతీయ భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక కొత్తూరులోని కృష్ణా హెస్పియన్స్ జూట్‌మిల్లులో సోమవారం మిల్లు హెచ్‌ఆర్ మేనేజర్ ఎస్‌ఎ సురేష్ అధ్యక్షతన ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జూట్‌మిల్లు కార్మికులకు భద్రతాపై వ్యాసరచన, కార్టూన్‌లు తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో మిల్లు సేఫ్టీ ఆఫీసర్ ఎస్.లక్ష్మణరావు, ఫైర్ ఆఫీసర్ సూర్యచంద్రరావు, ఎలక్ట్రికల్ ఇంజినీర్లు రాధాకృష్ణ, నర్సింహారావు, మిల్లు సిబ్బంది పాల్గొన్నారు.

అగ్గిపుల్లలపై నాటు నాటు పాట



అగ్గిపుల్లలపై ఆర్‌ఆర్‌ఆర్‌లోని నాటు నాటు పాట స్టెప్‌ను చిత్రీకరణ

ఏలూరు(టూటౌన్): ఆస్కార్ అవార్డును దక్కించుకున్న ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలోని నాటు నాటు పాటకు సంబంధించిన హీరోలు రామ్‌చరణ్, జూనియర్ ఎన్టీఆర్ స్టెప్‌లను అగ్గిపుల్లలపై చిత్రీకరించి తన ప్రతిభను చాటుకున్నారు ఏలూరుకు చెందిన మైక్రో ఆర్టిస్ట్ మేతర సురేష్‌బాబు. ఆస్కార్ అవార్డు పొందిన నేపథ్యంలో గుర్తుగా అగ్గిపుల్లలపై దానికి సంబంధించిన నృత్యభంగిమను చిత్రీకరించినట్లు ఈ సందర్భంగా మైక్రో ఆర్టిస్ట్ సురేష్‌బాబు తెలిపారు.

రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణం



పెరుగ్గూడెంలో డ్రైనేజీ, రోడ్డు పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ రేవతి రామకృష్ణ

దెందులూరు: పెరుగ్గూడెంలో రైతులకు, గ్రామస్తులకు శాశ్వతంగా ప్రయోజనం కలిగేలా రూ.4 లక్షల సొంత నిధులతో సర్పంచ్ యలమర్తి రేవతి రామకృష్ణ రోడ్డు, డ్రైనేజీని ఏర్పాటు చేశారు. ఇళ్లల్లోని వాడకం నీరు బయటకు పంపే విధంగా తూరల్లో డ్రైనేజీని ఏర్పాటు చేసి మురుగుకుంటను రోడ్డుగా మార్చే పనులను సర్పంచ్ పూర్తి చేశారు.

వాహనాల తనిఖీ

దెందులూరు: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జాతీయ రహదారిపై నియోజకవర్గంలో మూడు ప్రధాన రహదారులపై సోమవారం ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి ఏవీ నాంచారయ్య, దెందులూరు పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రహదారులు చెక్‌పోస్టుల వద్ద ముమ్మరంగా వాహనాల తనిఖీ నిర్వహించారు.

పామాయిల్ ఫ్యాక్టరీ కార్మికుల సమ్మె

చింతలపూడి: చింతలపూడి మండలం, సీతానగరంలోని పామాయిల్ ఫ్యాక్టరీ కార్మికులు సోమవారం రాత్రి మెరుపు సమ్మెకు దిగారు. ఉద్యోగులకు, కార్మికులకు చెల్లించాల్సిన ఇంక్రిమెంట్లు, జీతాల పెరుగుదల విషయంలో ఫ్యాక్టరీ యాజమాన్యం సంవత్సరాల తరబడి అన్యాయం చేస్తోందని ఆరోపిస్తూ గేటుముందు ఆందోళన చేపట్టారు. కార్మికుల సమ్మెకు సీఐటీయూ సంఘీభావం ప్రకటించి ఆందోళనలో పాల్గొన్నారు.

రూపురేఖలు మారనున్న ఏలూరు రైల్వేస్టేషన్

- అమృత్ భారత్ స్టేషన్స్ పథకంలో ఏలూరు
- 53 రకాల మౌలిక సదుపాయాల కల్పన



ఏలూరు రైల్వే స్టేషన్

ఏలూరు (టూటౌన్): అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద ఏలూరు రైల్వే స్టేషన్‌ను ఆధునీకరించనున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఈ పథకం కింద దేశ వ్యాప్తంగా 1275 రైల్వే స్టేషన్లను ఆధునీకరించాలని రైల్వేశాఖ నిర్ణయించింది. దీనిలో భాగంగా మన రాష్ట్రంలో 72 రైల్వే స్టేషన్లను ఎంపిక చేశారు. దానిలో ఏలూరు జిల్లా కేంద్రమైన రైల్వే స్టేషన్‌కు చోటు దక్కింది. దీంతో అమృత్ భారత్ స్టేషన్స్ పథకం కింద రైల్వే స్టేషన్లల్లో 53 రకాల మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తారు. ప్రతి స్టేషన్ అభివృద్ధికి ప్రత్యేక మాస్టర్ ప్లాన్ రూపొందించనున్నారు. ఈ పనులను దశలవారీగా చేపట్టనున్నట్లు రైల్వే అధికారులు చెబుతున్నారు.

రైల్వేస్టేషన్‌లో కల్పించే సౌకర్యాలు ఇలా: స్టేషన్‌లో భవనాలు, ఫ్లోరింగ్ ఆధునిక శైలిలో నిర్మాణం చేయనున్నారు. ప్రస్తుతం 600 మీటర్ల పొడవు ఉన్న రైల్వే ప్లాట్‌ఫాంలను 765 మీటర్ల నుంచి 840 మీటర్లకు పెంచనున్నారు. స్టేషన్ వద్ద ట్రాక్‌ల శుభ్రత, సులభమైన నిర్వహణ కోసం బ్యాలస్ట్‌లెస్ ట్రాక్‌లను ఏర్పాటు చేయనున్నారు. ప్రయాణీకుల తాకిడిని బట్టి ఎస్కలేటర్ల ఏర్పాటు, దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా వీల్ చైర్లు, ప్రత్యేక ప్రవేశమార్గాలు రానున్నాయి. వెయింటింగ్ హాలు, దానికి అనుబంధంగా కేఫెటీరియా, స్థానిక ఉత్పత్తుల విక్రయానికి రెండు స్టాల్స్ ఏర్పాటు చేయనున్నారు. స్టేషన్‌కు రెండువైపులా అప్రోచ్ రోడ్లు, పార్కింగ్ సదుపాయం, పాదచారులకు ప్రత్యేక దారి ఏర్పాటు కానుంది. ల్యాండ్ స్కేపింగ్, ఆధునిక లైటింగ్, వేగవంతమైన వైఫైవ్ సేవలు అందించనున్నారు.

ఆధునీకరణతో ప్రయాణికులకు ప్రయోజనం



ఏలూరు రైల్వేస్టేషన్‌ను అమృత్ భారత్ స్టేషన్ పథకంలో ఆధునీకరించడం వల్ల ఏలూరు నగరం పరిసర ప్రాంతాల నుంచి ఏలూరు స్టేషన్ ద్వారా ప్రయాణించే వారికి ఎంతో ప్రయోజనం కలుగుతుంది. జిల్లా కేంద్రమైన ఏలూరు స్టేషన్‌ను ఈ పథకంలో ఎంపిక చేయడం అభినందనీయం. రైల్వే మంత్రిత్వశాఖ త్వరితగతిన పనులను ప్రారంభించి ఆధునిక వసతులను ప్రజలకు అందించాలని కోరుతున్నారు.

లక్కోజు రాజగోపాలాచారి,
జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఏలూరు అర్బన్

రాష్ట్రంలో 72 స్టేషన్లను ఆధునీకరించడం అభినందనీయం



అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద రాష్ట్రంలోని 72 రైల్వేస్టేషన్లను ఆధునీకరించేందుకు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం అభినందనీయం. దీనిలో భాగంగా జిల్లా కేంద్రమైన ఏలూరు రైల్వేస్టేషన్‌ను ఆధునీకరించడం శుభపరిణామం. ఏలూరు రైల్వేస్టేషన్ ఆధునీకరించాలని తొందరలోనే ప్రారంభించేందుకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఆధునీకరణ పనులు పూర్తయితే ఏలూరు నగరం, పరిసర గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

నాగం శివ, డీఆర్‌యూసీసీ సభ్యులు, దక్షిణమధ్య రైల్వే, విజయవాడ

దాతల సహాయంతో తాగునీటి బోర్ల నిర్మాణం

కొయ్యలగూడెం: పరింపూడి పంచాయతీ పరిధిలో తాగునీటి బోర్లు నిర్మాణం ప్రారంభించినట్లు సర్పంచ్ ముప్పిడి విజయ కుమారి సోమవారం పేర్కొన్నారు. లివింగ్ సాక్రి ఫ్రైజ్ మినిస్ట్రీస్ సంస్థ డైరెక్టర్ మల్లిపూడి దేవ సహాయం, ట్రెజరర్ ప్రేమ కుమారి దంపతుల ఆర్థిక సాయంతో పనులను ప్రారంభించమన్నారు. బోర్ల నిర్మాణానికి సంస్థ రూ.20 లక్షలు పంచాయతీకి విరాళంగా అందజేసిందని అన్నారు. తారకరామా నగర్, చేపల పేట, బ్రహ్మల కాలనీ మొత్తం మూడు చోట్ల తాగునీరు కొరకు బోర్లు వేయించమని పంచాయతీ అభ్యర్థన మేరకు దాతలు స్పందించారన్నారు. బోర్లు నిర్మాణంతోపాటు తాగునీటి ట్యాంకులను ఆయా ప్రాంతాల్లో నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్‌ఎస్‌ఎం సంస్థ సిబ్బంది సామ్యూల్ కనకరాజు, సోమేశ్వరరావు, దుర్గాప్రసాద్, కృష్ణ కాంత్, వార్డు మెంబర్లు బూసి త్రిమూర్తులు, ఎస్‌ఎస్ గణేష్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా వాటర్ స్పోర్ట్స్



వాటర్ స్పోర్ట్స్ విభాగంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ఏలూరు రూరల్: ప్రపంచ మహిళ దినోత్సవం పురస్కరించుకుని చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం మహిళకు వాటర్‌స్పోర్ట్స్ నిర్వహించామని జిల్లా చీఫ్‌కోచ్ బి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. జంగారెడ్డిగూడెం ఎర్రకాలువ వద్ద వాటర్‌స్పోర్ట్స్ సెంటర్‌లో చేపట్టిన శారీరక సామర్థ్యపు పోటీల వివరాలు వెల్లడించారు. పలు విభాగాల్లో బాలికలు, మహిళలకు చేపట్టిన పోటీల్లో విజయం సాధించిన వారికి పతకాలు అందించామని వివరించారు.



పోలింగ్‌కు ముందు బ్యాలెట్ బాక్సును పరిశీలిస్తున్న దృశ్యం



పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తు

ఏలూరులో ప్రశాంతంగా ఎమ్మెల్సీ పోలింగ్

జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా జరిగింది. ఎక్కడ ఎటువంటి అవాంచనీయ సంఘటనలకి తావులేకుండా ఓటర్లు తమ హక్కును వినియోగించుకున్నారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. దీంతో పోలింగ్ కేంద్రాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. పోలింగ్ ప్రక్రియ సందర్భంగా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. – సాక్షి నెట్‌వర్క్



పోలింగ్ కేంద్రం వద్ద గుర్తింపు కార్డులు పరిశీలించిన లోపలికి పంపుతున్న పోలీసులు



ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రం నుంచి 100 మీటర్ల దూరం ఏర్పాటు చేసిన బారికేడ్స్



ఓటు వేసేందుకు వేచి ఉన్న ఎంపీటీసీలు, జడ్పీటీసీలు

ఇంటర్ హాల్ టికెట్ లింక్ ఇవ్వాలి



ఆర్‌ఐఓకి వినతిపత్రం సమర్పిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇంటర్మీడియట్ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యార్థుల దగ్గర్నుంచి ఫీజులను బలవంతంగా వసూలు చేస్తూ పెండింగ్ ఫీజులు కడితేనే కానీ హాల్ టికెట్లు ఇవ్వమని చెబుతున్న నేపథ్యంలో ఆర్‌ఐవో చంద్రశేఖర్ బాబుకు పీడీఎస్‌యూ నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని మాట్లాడుతూ ఫీజులు కట్టమని ఒత్తిడి చేస్తూ హాల్ టికెట్లు ఆపుతున్న నేపథ్యంలో ప్రభుత్వం గత రెండు, మూడు సంవత్సరాల నుంచి విద్యార్థులకు ఉపశమనం కలిగించేలా బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ నుంచి లింక్ విడుదల చేస్తుందని దీని ద్వారా విద్యార్థులు స్వయంగా హాల్ టికెట్‌ని డౌన్లోడ్ చేసుకొని, ప్రశాంతంగా పరీక్షలు రాసేవారన్నారు. కానీ ఈ సంవత్సరం ఇప్పటివరకు లింక్ విడుదల చేయకపోవడం వలన అనేక కారణాలతో ఫీజులు కట్టలేని విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారని, దీనిని ఆసరా చేసుకొని ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యాలు హాల్ టికెట్‌లు ఇవ్వాలంటే కచ్చితంగా ఫీజు మొత్తం పూర్తిగా కడితేనే ఇస్తామని విద్యార్థుల్ని మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం టోల్ ఫ్రీ నెంబర్ ఇచ్చినా గాని దానివల్ల పెద్దగా ఉపయోగం లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు, వెంటనే ప్రభుత్వం లింక్ విడుదల చేసి విద్యార్థులను పరీక్షలు ప్రశాంతంగా రాసుకునే వాతావరణాన్ని కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి యం.జానకి రామ్ పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



ఏలూరు వన్‌టౌన్‌లో ఫీవర్ సర్వే చేస్తోన్న వైద్య ఆరోగ్య సిబ్బంది

ఏలూరు టౌన్: వాతావరణంలో వస్తోన్న మార్పుల నేపథ్యంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ... వైద్యుల సూచనలు పాటించాలని ఏలూరు అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు తెలిపారు. హెచ్3ఎన్2 ఇన్ఫ్లుయెంజా వైరస్ వ్యాప్తిని, సాధారణ వైరల్ ఫీవర్స్‌ను అరికట్టేందుకు ప్రజలు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఏలూరు వన్‌టౌన్ పడమరవీధి, దక్షిణపు వీధి సచివాలయం పరిధిలో వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు, వలంటీర్లు సంయుక్తంగా ఇంటింటా ఫీవర్ సర్వే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ జలుబు, ముక్కు నుంచి నీరు కారుట, జ్వరం, తుమ్ములు, గొంతునొప్పి వంటి వైరస్ లక్షణాలు కావచ్చని తెలిపారు. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదనీ జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుందన్నారు. తుమ్ములు వస్తే చేతిరుమాలు అడ్డుపెట్టుకోవాలనీ, చేతులు ఎప్పటికప్పుడు చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. కాచ్చి చల్లార్చిన గోరువెచ్చని నీటిని తాగాలని, ఆవిరి పీల్చాలని సూచించారు. జ్వరం వస్తే అన్ని పరీక్షలు ఉచితంగా చేస్తామనీ, డెంగూ మలేరియా కిట్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. ప్రజలు జ్వరాల పట్ల నిర్లక్ష్యంగా ఉండకుండా అప్రమత్తంగా ఉండాలనీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు శ్రీలక్ష్మి, శేశారత్నం, ఆశా కార్యకర్త రాజేశ్వరి, హర్షలత, హారిక, శివజ్యోతి, రవికిరణ్ తదితరులు ఉన్నారు.

వైభవంగా ప్రారంభమైన నూకాలమ్మ జాతర



కలశాల ఊరేగింపుకు సిద్ధమౌతున్న కన్యలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక కొత్తపేటలోని నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారి జాతర మహోత్సవాలు సోమవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి మంగళ స్నానాలు ఆచరింపచేశారు. అనంతరం అమ్మవారికి కుంకుమ పూజలు చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ సందర్భంగా 108 మంది కన్యలు కలశాలతో నగర వీధుల్లో భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఘటాల ఊరేగింపు నిర్వహించగా భక్తులు దారి పొడవునా అమ్మవారికి, పోతురాజు బాబుకు నీరువారపోసి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం లడ్డూ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ధూప, దీప నైవేథ్యాలు సమర్పించి భజనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మంత్రవాది రామకృష్ణ యోగానంద శర్మ విశేష పూజలు నిర్వహించగా కార్యనిర్వహణాధికారి ఏ. రవిశంకర్ కార్యక్రమాలు పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక తూర్పువీధిలోని శ్రీ శివయ్య దేవస్థానంలో సోమవారం శ్రీ సీతారామచంద్ర స్వామి దివ్య విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రత్నన్యాసం, యంత్రన్యాసం, ధాతున్యాస పూజలు నిర్వహించి అనంతరం మహాపూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం శ్రీ సీతారామలక్ష్మణ స్వామి జీవధ్వజ, శిఖర, ద్వారపాలక, శ్రీ ఆంజనేయ స్వామి యంత్ర ప్రతిష్ఠ నిర్వహించారు. అనంతరం స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం శాస్త్రోక్తంగా అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో కుంభాభిషేకం, గోదృష్టి పూజలు నిర్వహించి వేదా శీర్వచనం చేశారు. మధ్యాహ్నం నుంచి స్వామి వారి మహాన్న ప్రసాద వితరణ చేశారు. ఖండవల్లి వేంకట సూర్య జగన్నాథాచార్యులు, వేదాన్తం రామాచార్యులు విశేష పూజలు నిర్వహించగా ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం. రాధ కార్యక్రమాలు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదం స్వీకరించారు.

19 నుంచి ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవాలు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ముత్యాలమ్మ తృతీయ వార్షికోత్సవాలు ఈ నెల 19 నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ నిర్మాణకర్త బవిరిశెట్టి మురళి తెలిపారు. జంగారెడ్డిగూడెం ముత్యాలమ్మ ఆలయంలో వైద్యురాలు జంగా ఇంద్రాణి, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి వార్షికోత్సవ వేడుకల కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ మొదటి రోజు 19వ తేదీ ఆదివారం ఉదయం 8 గంటలకి ముత్యాలమ్మ గుడి దగ్గర అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహిస్తామన్నారు.

19న ఏఐటీయూసీ మహాసభ

చింతలపూడి: ఈ నెల 19న నిర్వహించనున్న ఏఐటీయూసీ చింతలపూడి ఏరియా ద్వితీయ మహాసభలను జయప్రదం చేయాలని అధ్యక్ష, కార్యదర్శులు కంకిపాటి బుచ్చిబాబు, టి బాబు పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద సోమవారం మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1920 నుంచి కార్మికుల హక్కుల కోసం ఏఐటీయూసీ అనేక పోరాటాలు చేస్తోందని తెలిపారు. 19న స్థానిక మార్కెట్ కమిటీ ఆవరణలో నిర్వహించనున్న మహాసభకు కార్మిక అనుబంధ రంగాల కార్మికులు హాజరై జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏఐటీయూసీ ఏరియా కోశాధికారి చేపల్లి శ్రీనివాసరావు, నక్కా తిరుపతిరావు, కంపసాటి శ్రీను, రమేష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	31
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	37
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	43
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	24
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	33
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	22
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	34
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	33
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు - తిరుపతి	16.00	4830	33